
# సౌహార్దం

—సిహెచ్. కాంతాదేవి



రైలు స్టేషన్‌లో ఆగింది. బెంచీమీద కూర్చున్న మీనాక్షమ్మ చటుక్కునలేచి నిలబడింది. జగన్నాథంగారు ఒక్కో పెట్టె వెతుకుతూ కంగారుగా తిరుగుతున్నారు . . . ఆలోచిస్తూ నిలబడిపోయిన మీనాక్షమ్మ దగ్గరగా వస్తూ, "అమ్మా" అన్నాడు సూర్యం ఆప్యాయంగా.

ఉలిక్కిపడింది మీనాక్షమ్మ.

"సూర్యం"– కొడుకువేపు చూసింది. గుర్తుపట్టలేనంతగా మారిపోయిన సూర్యాన్ని చూసి ఇన్నాళ్లూ తన చేతుల్లో పెరిగినవాడు వీడేనా అన్న అనుమానం కలిగింది ఆవిడకి ఒక్కక్షణం.

"కులాసానా అమ్మా!" అన్నాడు.

"ఊఁ . . . నీ ఒంట్లో ఎలా ఉంటూంది?

డబ్బుకోసం తాపత్రయపడని మనిషి ఎప్పుడూ మానసిక విలువలకు ప్రాధాన్యం యిస్తాడు. అవి అయిన వారిలో దిగజారిపోతుంటే బాధ పడతాడు. నిజమైన ప్రేమానురాగాలు లభించక, భ్రాంతిలో బ్రతికేవారికి, ఒక్క మెట్టు పైకి వెళ్లిచూస్తే, ప్రపంచ సత్యం శూన్యంగా గోచరిస్తుంది.

అన్నట్టు అమ్మాయిని తీసుకు వచ్చావా?" అంది ముద్దా పరకాయించి చూస్తూ.

"లేకపోతే నువ్వూరుకుంటావా?" అంటూ భార్యని చూసిస్తూ, "నువ్వింతవరకూ చూడలేదు కదూ! ఏం చెయ్యనమ్మా, తప్పని పరిస్థితులు వచ్చాయి. కాని నువ్వు చూసేవరకూ ఆ వెలితి వాకలాగే ఉండి పోయింది." మీనాక్షమ్మ సూర్యం మాటలు వినటం లేదు. కోడలివేపు చూస్తూంది. సుశీల పెద్ద అందగత్తె కాకపోయినా అనాకారిమాత్రం కాదు. చూడగానే ఆకర్షించే రూపం కాదుగానీ, ఆమెతో గడిపిన కొద్దీ ఆమె సౌజన్యం అర్థమవుతుంది. తన విశాలమైన కళ్లతో చూస్తూనే అందర్నీ ఆకర్షించు కోగల ప్రేమ వెదజల్లగలదు. మొహంలో వినయం, శీలం కొట్టవచ్చినట్టు కనిపిస్తున్నాయి. కాని మీనాక్షమ్మకి తృప్తి కలగటంలేదు ఎంతసేపు చూసినా. తనలోని అసంతృప్తిని మొహంపైకి ఏమాత్రం కనపరచకుండ మామూలుగా మాట్లాడింది.

జగన్నాథంగారు రిక్షాలు మాట్లాడుకుని వచ్చారు, "ఎక్కండి త్వరగా" అంటూ . . . . . "మీ కోడల్ని చూసుకున్నారా?" రిక్షాలోపల పలకరించింది భర్తని మీనాక్షమ్మ. చిరునవ్వు తొంగి చూసింది ఆయన మీసాల చాటున.

"నా కొడుకు అంచనా ఎప్పుడూ తప్పుకాదు . . . ఏం, నీకు నచ్చలేదా?" , మీనాక్షమ్మ కొద్దిసేపు మాట్లాడలేదు.

అది గ్రహించి జగన్నాథంగారు, "నచ్చక పోవటమేం, బంగారుబొమ్మలా ఉంటేనే మనంమాత్రం ఇంతకన్న అందగత్తెని తీసుకు రాగలమా?"

ఒక్కక్షణం ఉండి, "అయినా వాడివాళ్ళు, వాడు కోరి చేసుకున్నారు, మధ్యలో మనమెవరం వెండలు వెయ్యటానికి?" ఆమె మాటల్లోని భావం అర్థం కాలేదాయనకు.

"అంటే నీ ఉద్దేశం?"

"అబ్బే! ఏంలేదు. అయినా పిల్లకేం, విక్టోరియాలా ఉంటే . . . " అని ఊరుకుంది మీనాక్షమ్మ.

ఇంటికి వచ్చాక సావధానంగా అడిగి తెలుసుకుంది మీనాక్షమ్మ. తేలిన విషయమేమంటే, సుశీలావాళ్ళ పీమంత ఆస్తిపరులు కాదనీ, ఆ పిల్ల తండ్రి వెనక ఎప్పుడో సూర్యం తండ్రి కింద గుమాస్తాగా చేశాడనీ, కాలక్రమాన అతను చనిపోవటంతో ఆ కుటుంబంమీద ప్రేమ, అభిమానాలకొద్దీ సూర్యం తండ్రి పిల్లల్ని చేరదీశాడనీ, అందుకు ఫలితంగా సుశీలను తమ ఇంటి కోడలిగా చేసుకోవాలనే కోరిక వెలిబుచ్చటం, సహజంగా జాలిగుండె కలవాడైన సూర్యం ఇందుకు సమ్మతించటం . . . . ఇదంతా సూర్యం స్వయంగా చెప్పాడు తల్లికి. తరవాత అన్నాడు. "నాన్నగారు కాదనరని నాకు తెలుసు. నువ్వు కూడా సంతోషంగా అంగీకరిస్తావనే నా నమ్మకం ... అమ్మా, నే నెప్పుడూ ఆలోచించకుండా ఏ పనీ చెయ్యనని నీకు తెలుసుగదా!" అంతా విన్న మీనాక్షమ్మ కేమి మాట్లాడాలో తోచలేదు. కాని మనసులో అనుకుంది 'వాడి పెళ్లి పెత్తనం మా చేతుల్లో పెడితే, ఇంతకన్న మంచి సంబంధం తీసుకురాగలం'మని. పైకిమాత్రం సౌమ్యంగా అన్నది. "అవున్నలే నాయనా! నువ్వు మాత్రం ఏమీ తెలీనివాడివా? నీ మంచిచెడ్డలు నిర్ణయించుకునే బాధ్యత నీకు తెలుసుకునే వయసు వచ్చింది. అదిగాక, పైన మీ అమ్మా, నాన్నగారు ఉన్నారు. మా కన్నా వాళ్లకే బాధ్యత ఎక్కువగదా!" తల్లి మొహంలో భావాలు చదవలేకపోయాడు సూర్యం.

"అదేమిటమ్మా అలా అంటావు! చిన్నప్పటినించీ పెంచి పెద్ద చేసింది మువ్వేగానీ వాళ్ళు కాదుగదా! . . . నువ్వింత బాధపడతావని నేనమకోలేదమ్మా! నేను కోరి చేసుకున్న భార్యని సంతోషంగా ఆదరిస్తావని నమ్మాను."

"ఇప్పుడేమైందని బాబూ! నాకేం బాధలేదు. నీ సంతోషంకన్నా నాకేదీ ఎక్కువకాదు. సుశీలకేం తక్కువ? లక్షణంగా ఉంది. నువ్వావిషయం గురించి ఎక్కువగా ఆలోచించకు. . . . ." కొడుకు తల నిమిరి అక్కడినుండి వెళ్ళిపోయింది. తలుపుచాటున నిలబడి అంతా వింటున్న జగన్నాథంగారు సాయంత్రం కొడుకూ కోడలూ గదిలో ఉండగా చూసి మెల్లిగా వంట చేస్తున్న భార్య దగ్గిరికి వచ్చారు.

మీనాక్షమ్మ తలఎత్తి చూసి నవ్వింది. "కూర్చోండి" అంటూ పీట వాల్చింది.

"ఏమిటి విశేషం?" నవ్వుతూ చూశారు భార్యవేపు. చిరునవ్వు నవ్వింది మీనాక్షమ్మ.



"కొడుక్కేదో రహస్యాలు చెబుతున్నావు, నామీద కాదుగదా!" హాస్యంగా అన్నారు.

"నేనేం చెప్పాను? మీమీద చెబితేమాత్రం నమ్ముతాడా వాడు? పైపెచ్చు నన్నే అంటాడు"-నవ్వుతూ అంది.

కొద్దిసేపు మౌనంగా గడిచింది.

"ఏ పనైనా జరిగిపోయాక చేసేదేమీ ఉండదు. ఆ చెయ్యగలిగేది మన చేతుల్లో లేనప్పుడు అవలు ఏం చెయ్యలేం".

మీనాక్షమ్మ తలఎత్తి చూసింది భర్తవేపు.

"మీరు చెప్పేదేమిటి?"

"అయిందేదో అయింది. ఇప్పుడు వాడి మనను కష్టపెట్టుకుంటే మనకు మాత్రం ఏం సంతోషం? నిన్నేదో అంటున్నాననుకోకు. మనపిల్లలు ఏం చేసినా మనం చేరదియ్యకపోతే; అది తప్పుగానీ, ఒప్పుగానీ . . . ఏమంటావు?"

". . . . . . . . . . ."

"వాడేం పసిపాపాయిగాదు, ఇంకా మన చెప్పుచేతల్లో ఉండటానికి. వాడికీ యుక్తాయుక్తాలు తెలుసుకునే జ్ఞానం వచ్చింది. వాడినంగతి వాడు చూసుకోగలడు."

"వరేలెండి. ఇప్పుడు వాడినేమన్నానని ... మీరింతగా వెనకేసుకురావటానికి. . . ." చిరుకోపం ప్రదర్శించింది మీనాక్షమ్మ.

"ఇటు చూడు. నీ బాధ నాకు తెలుసు. మనకిక కనీసం చెప్పటానికి కూడా వాడికిష్టం లేకపోయిందని నువ్వు అనుకుంటున్నావు గదూ! లేదు. నాకు ఉత్తరం రాశాడు చూడు" అంటూ జేబులోంచి ఉత్తరం తీసి ఇచ్చాడు.

మీనాక్షమ్మ చదివింది.

"నాన్నగారికి,

మీ కుమారుడు అనేక నమస్కారములుచేసి వ్రాయునది. నేను త్వరలో అక్కడికి వచ్చి అమ్మగారిని, మిమ్మల్ని చూచి వెడదామనుకుంటున్నాను. నాకు ఎక్కువ టైములేదు. కానీ ఈమధ్య ఇక్కడ అమ్మా, నాన్నగారు పట్టుపడుతున్నారు పెళ్లి విషయం తేల్చుకు వెళ్లమని. కనీసం మీతో సంప్రదించకుండా ఏర్పాట్లు చేసుకోవటం నా కిష్టంలేదు. ఇంకో విషయం కూడా చెప్పాను. నా పైచదువులు పూర్తి అయితేగానీ పెళ్లి చేసుకోవటం ఇష్టం లేదని చెప్పాను. ఇందుకు మీ అంగీకారం కూడా కావాలి. అమ్మగారికి నమస్కారాలు అందచెయ్యవలెను. నేను త్వరలో ప్లేన్‌లో వెళ్ల బోతున్నాను. వీలైతే అక్కడ దిగుతాను.

మీ కుమారుడు,

సూర్యం."

ఆ ఉత్తరం మూడేళ్లకిందట రాసింది. ఉత్తరం చదవటం పూర్తిచేసి భర్త చేతికిచ్చింది.

"చదివావుగదా! కాబట్టి ముందుగా మనకు తెలియ చెయ్యటానికి వాడికి తీరిక దొరకలేదు. సరే, తరవాత అంటే పెళ్లయినాక రాసిన ఉత్తరం నువ్వూ చదివావుగా! దాన్నిబట్టి నీకూ తెలిసే ఉంటుంది, ఆ పిల్లని మనం చూట్టానికి ఏ మాత్రం వీల్లేని పరిస్థితులని. పెళ్లికి వెళ్లటానికి మన ఇబ్బందులు అప్పుడు ఎటువంటివో గుర్తున్నాయా? . ." జగన్నాథం కళ్లలో విచారం కనిపిస్తూంది. ఒళ్ళు జలదరిస్తుండగా మీనాక్షమ్మ అంది.

"అబ్బ! చెప్పకండి. తలుచుకుంటే భయం వేస్తుంది."

ఒంటినిండా పొక్కులతో చీమూ, రక్తమూ కారుతుంటే ఎక్కడికీ కదిలేస్థితిలోలేని తమా, తనకు చాకిరీ చెయ్యలేక, ఎవరూ సాయంలేక నానా అవస్థ పడిన భర్తా . . . . పాపం! ఆయన్ని అంతగా ఎప్పుడూ కష్టపెట్టలేదు, పెళ్లయిన ఈ నలభై ఏళ్లలోనూ. అట్లా ఇరవైరోజులు తను మంచంలో తీసుకుంది.

"పోనీ మీరైనా వెళ్లండి. ఎవరూ వెళ్లకపోతే వాడేమీ అనుకోకపోయినా, అవతలివాళ్లేమైనా అనుకుంటారు, ఇన్నాళ్లూ పెంచిన తల్లీ, తండ్రీ అని. నా మాట వినండి" అంటూ ఎంతగానో బ్రతిమిలాడింది.

కాని ససేమిరా ఆయన వినలేదు. పైగా,

"నిన్నీస్థితిలో వదిలి వెళ్లమంటావా? నేనూ మనిషినే! నా కొడుకు నన్ను గురించి ఎప్పుడూ చెడుగా అనుకోడు. ఇక పైవాళ్లమాటంటావా? వాళ్లకేం తెలుస్తాయి మన కష్టసుఖాలు?" అంటూ తన మాటను తోసేశారు. ఆ మాటలు తనెప్పటికీ మరిచిపోలేదు.

కళ్లనీళ్లు తుడుచుకుంటున్న భార్యని చూస్తూ,

ఉందనుకో . . . చెప్పేదేమంటే, మీ పెద్దవాడిని నా దగ్గిర కొన్నాళ్లపాటు ఉంచుకుందామని . . . వాడు పూర్తిగా మాకు పంపకమైపోనక్కరలేదు. మీరెప్పుడు చూడాలనుకున్నా, వాడికెప్పుడు చూడాలనిపించినా నిరభ్యంతరంగా తీసుకువెళ్లవచ్చు. ఎందుకంటే కేవలం మా ఒంటరితనం . . . మాకు అనేకున్నా, దానికి అంటే బాగుంటుంది. ఈ విషయంలో నాకన్నా అది ఎక్కువగా బాధపడుతూంది. ఇప్పుడు నేనేదైనా చేశానంటే దానికోసమే! ..." రామానందం మౌనంగా ఆలోచించసాగాడు. అతని మొహంలో ఏవో కారు మేఘాలు అలుముకున్నాయి. అది చూసి తన స్నేహితుడు ఎక్కడ బాధపడతాడోనని సాధ్యమైనంతవరకూ కప్పెట్టుకుంటూ అన్నాడు మెల్లిగా.

"నేనేవిధంగానైనా నీకు సహాయం చెయ్యగలిగితే నాకు సంతోషమే! మన చిన్ననాటిస్నేహం నేనెప్పటికీ మరిచిపోలేను. ఎప్పుడూ నీమాటేదీ కాదనలేదు. ఇప్పుడు మాత్రం ఎందుకు కాదంటాను? కానీ నా భార్య అంగీకారం కూడా కావాలిగా! ఎంతయినా తల్లిగదా!"

"ఆ బాధ్యత అంతా నీదే! ముఖ్యంగా మీనాక్షిని దృష్టిలో పెట్టుకుని ఆలోచించు .... ఇంతకన్నా నీకేం చెప్పను?"

"మరి మధ్యలో వాడి చదువు?"

"దానికి అడ్డేమీరాదు. వాడు ఈ ఏడాది అవకుండా బళ్లో చేర్పే బాధ్యతనాది." ఇద్దరికీ ఇంకేమీ సంభాషణ జరగలేదు.

భర్త చెప్పిన సంగతి అంతావిని రేణుక మొదట్లో రామానందం నచ్చచెప్పాడు. బాధపడిందిగానీ,

"నీ బిడ్డకేమీ ఫర్వాలేదు. మా స్నేహం ఎటువంటి దనుకున్నావూ? వాడి కోసం నేను, నా కోసం వాడు ప్రాణత్యాగం చెయ్యటానికైనా సిద్ధపడతాము. ఇహ ఆవిడ సంగతి అంటావా? ఈ రెండురోజుల్లో మా ఆమె స్వభావం నీకు తెలిసే ఉండచ్చు. పిల్లవాడిని కళ్లలో పెట్టి చూసుకుంటుంది. అయినా మనం ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు వాడిని తీసుకువచ్చేద్దాం. నేను మాత్రం ఆలోచించకుండానే ఒప్పుకున్నాననుకున్నావా?" ఒక్కక్షణం ఆగి తల వంచుకుని నిలబడిన భార్యని చూసేసరికి ఏదో బాధ కలిగింది.

"చూడు. నీ మనసులో ఏ మాత్రం అభ్యంతరం ఉన్నా నిస్సంకోచంగా చెప్పు. నీకిష్టం లేకుండా నీ కొడుకుని నీకు దూరం చేసేంత మూర్ఖుణ్ణి కాదు."

రేణుక నవ్వింది మెల్లిగా.

"అలాగే! మీ ఇష్టప్రకారమే కానివ్వండి. మీరింత ధైర్యంగా చెబుతూంటే నేనెందుకు కాదంటాను?"


జగన్నాధం, మీనాక్షమ్మల తిరుగు ప్రయాణం సంతోషంగానే గడిచింది. వెళ్లేటప్పుడు మీనాక్షమ్మ రేణుకచేతులు పుచ్చుకుని,

"మీమేలు ఎప్పటికీ మరిచిపోలేను. నా మోడువారిన జీవితంలో ఇదొక వసంతం. సూర్యాన్ని నాకన్నబిడ్డలా చూసుకుంటాను" అంది గద్గదస్వరంతో.

రేణుక మాట్లాడలేదు. పిల్లవాడి తల నిమిరింది మౌనంగా.

జగన్నాధం దంపతులు వెళ్లిపోయారు సూర్యాన్ని తీసుకుని.

సూర్యం కొత్త ఇంటినీ, కొత్త మనుష్యుల్నీ



మద్రాసు హైకోర్టు భవనములు ఫోటో— వై. విఠల్‌రావు (మద్రాసు - 53)

ఆశ్చర్యంతో పరికించటంతో సరిపోయింది కొంతసేపు. అమ్మా నాన్నలను విడిచి ఇక్కడ ఉండాలని వాడికి తెలిసినా ఇక్కడ కూడా స్కూలు ఉంటుంది. తను రోజూ బళ్లోకి వెడతాడు. ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు అమ్మా నాన్నలను చూసి రావచ్చు. ఈ మాటలన్నీ తండ్రి చెప్పగా విని వాడి చిన్నిహృదయం సంతోషించింది.

సూర్యం వయసుకు పన్నెండేళ్లవాడైనా అతి పసి మనసు వాడిది. అమాయకమైన మొహమూ, చిలిపి కళ్లూ, ఎప్పుడూ చిరునవ్వు నవ్వుతూ ఇల్లంతా కలయ తిరుగుతూ కొత్త అమ్మనీ, నాన్ననీ అనేకమైన ప్రశ్నలడుగుతూ కాలం గడుపుతున్నాడు. సూర్యం ఇంట్లో అడుగు పెట్టాక కొత్తకళ వచ్చింది అనుకున్నారు భార్యాభర్తలిద్దరు. తనకి తెలియనివన్నీ అడిగి చెప్పించుకునేవాడు నాన్నగారి దగ్గిర. రాత్రిళ్లు మీనాక్షమ్మ పక్కలో పడుకోబెట్టుకుని తనకు తెలిసిన పురాణగాథలూ, ఇంకా రాజుల కథలూ, రామదాసు కీర్తనలూ ఎన్నో వినిపించేది వాడికి. ఇహ తెల్లవారి లేచింది మొదలు మీనాక్షి వాడిని తనవెంటే ఉంచుకునేది. "బాబూ పళ్లు తోముకున్నావూ?" అనో, "పాలు తాగుతావూ?" అనో తను వంట చేస్తూంటే వాణ్ణి దగ్గిర కూర్చోపెట్టుకుని వాడికి వచ్చిన కథలు చెప్పించుకుంటూ, పద్యాలు పాడించుకుంటూ రోజులు నిమిషాలలాగా దొర్లిస్తూంది. సూర్యం వచ్చిన కొత్తలో అమ్మా, నాన్నా అని వాళ్లని గురించి ఆలోచిస్తూ, తమ్ముడినీ చెల్లాయినీ తల్చుకుంటూ ఉండేవాడుగానీ, రోజులు గడుస్తున్న కొద్దీ మీనాక్షమ్మ గారాబంలోనూ, జగన్నాధంగారి వాత్సల్యంలోను పూర్వపు ఆప్యాయతలన్నీ మరిచిపోయి ఆనందంగా రోజులు గడుపుతున్నాడు.

ఒకరోజు మీనాక్షమ్మ వంట చేస్తూంటే సూర్యం కూర తరిగి ఇస్తున్నాడు. జగన్నాధం లోపలికి వచ్చి అది చూసి నవ్వుతూ—

"ఇప్పటినుంచీ తర్ఫీదు ఇస్తున్నావన్నమాట, నీ కోడలు కష్టపడకుండా . . . ." అన్నారు.

మీనాక్షమ్మ కూడా నవ్వుతూ, "మీరేమాత్రం తర్ఫీదు పొందారేమిటి నన్ను సుఖపెట్టటానికి?" అన్నది.

"మరి మా అమ్మానాన్నలకి అంత ముందుచూపు లేదుగా" అని సూర్యంతో,

"లేచిరారా బాబూ, రేపటినించీ చదువు మొదలెట్టబోతూ నువ్వు చేసే నిర్వాకం ఇదన్నమాట" అన్నారు.

మీనాక్షమ్మ వెంటనే భర్తవేపు చూస్తూ, "చదువేమిటి?" అన్నది.

"మరి చదువులేక వంట నేర్చుకుంటూ కూర్చుంటాడనుకున్నావా? శాస్త్రుల్లుగారితో మాట్లాడాను. రేపు మంచిదన్నారు. రేపే బళ్లో చేర్పిస్తాను. ఇప్పటికే చాలారోజులు వృథాఅయిపోయినాయి."

"అదేమిటి? ఈ ఏటికి సీలువడదన్నారుగా!"

"అన్నాననుకో హెడ్మాస్టరుతో మాట్లాడానుగా! ఈ ఊళ్లో నా పలుకుబడి ఏమిటనుకుంటున్నావు? కొన్ని పాఠాలు పోయినా అబ్బాయి తెలివితేటలవల్ల పైకి రాగలడని చెప్పాను. ఆయన ఒప్పేసుకున్నాడు."

మీనాక్షమ్మ మొహంలో ఏమంత సంతోషం కనిపించలేదు. అయినా ఆడపిల్ల కనకనా తన వెంట తిప్పుకోవటానికి? మగపిల్లవాడు చదువు లేకుండా ఎట్లా, తన వాదనంతాగానీ.

సూర్యం బళ్లో చేరాడు. రోజులు గడిచిపోతున్నాయి. ఎప్పుడైనా అమ్మా, నాన్నలను చూసి రావాలనిపించినప్పుడు జగన్నాధంతో చెప్పేవాడు. వెంటనే ఆయన తన పనులన్నీ ఎవరికో అప్పగించేసి సూర్యాన్ని తీసుకు రైలెక్కేవారు. వారంరోజులో, పదిరోజులో ఉండి రామానందం అనుమతిమీద పిల్లవాణ్ణి తీసుకుని తిరిగి వచ్చేవారు. భర్తా పిల్లవాడు ఇంటికి తిరిగి వచ్చేదాకా కళ్లలో వత్తులు వేసుకుని ఎదురుచూసేది మీనాక్షమ్మ. సూర్యం ఎప్పుడైనా "మా ఇంటికి వెళ్లాలనుందమ్మా!" అంటేచాలు మీనాక్షమ్మగుండెలుగుబగుబలాడేవి. పిల్లవాడి నోటివెంట అటువంటి మాట ఎప్పుడు వస్తుందోనని ఆమె క్షణక్షణమూ భయపడుతూనే ఉంటుంది. అంటే సూర్యాన్ని వాడి తల్లిదండ్రులకి దూరం చెయ్యాలని ఆవిడ ఉద్దేశంకాదు. వీడిని దత్తత చేసుకోకపోయినా పూర్తిగా తమ పెంపకానికి ఇచ్చేశారనే ఆవిడ ఉద్దేశం. భర్త ఊరికే స్నేహితుడితో అట్లా అన్నా మనసులో ఆయన ఉద్దేశం కూడా అదేనని ఆవిడ నమ్మింది. కాబట్టి సూర్యం పూర్తిగా తమ కొడుకుగా మారిపోవాలని ఆవిడ ఆకాంక్ష.

సూర్యం బడికి వెడుతున్నా వస్తున్నా కళ్ళు ఇంత చేసుకుని చూస్తూండేది. వెళ్లేటప్పుడు తలకి నూనె రాసి, తల దువ్వి పుస్తకాలు చేతికందిచ్చి వాడు వీధి గడప దాటేవరకూ తను కూడా వచ్చి, "జాగ్రత్తగా










"వాణ్ని ఎందుకూ పనికిరాకుండా చేస్తున్నావు చిన్నప్పటినించీ. నీ గారాబానికి ఇంకోడైతే ఈపాటికి పాటలు పాడుకుంటూ ఏ భోగం కొంపల్లోనో అఘోరించేవాడు. మనవాడు బాగుపడినందుకు సంతోషించు. పెద్ద చదువులకు వెడుతూంటే ఈ ఏడుపేమిటి? నువ్వు కూడా పోతేపో . . ." ఆయన ఆ విధంగా మాటలనటం అదే మొదటిసారి. ఎంతో ప్రయత్నంమీద సీటు వచ్చింది. తల్లి మాటలకి కరిగిపోయి సూర్యం ఎక్కడ తన ప్రయాణం మానుకుంటాడోనని ఆయన భయం. ఇట్లాంటి సదవకాశాన్ని చేతులారా విడుచుకుంటే మళ్లీరాదు అనుకుని సూర్యంతో "నువ్వేమీ బాధపడకు బాబూ! రెండురోజులు పోయాక మీ అమ్మే సర్దుకుంటుంది. ఇది కేవలం నీ అదృష్టంవల్ల దొరికిందనుకో . . ." అని హెచ్చరించారు.

"నువ్వు బాధపడకమ్మా! మూడేళ్ళు ఎంతలో గడుస్తాయి? నాకు మాత్రం మిమ్మల్నందర్నీ విడిచి వెళ్లాలనుంటుందా? ఆక్కడున్నా నా ప్రాణాలన్నీ మీ మీదే ఉంటాయి. నన్ను సంతోషంగా పంపించు అమ్మా" అన్నాడు సూర్యం.

మీనాక్షమ్మ మాట్లాడలేదు. వాడులేని క్షణాన్నించీ ఈ ఇంట్లో తామిద్దరు ఒంటరిగా ఎల్లా ఉండగలుగుతామూ, అన్న ఆలోచనే ఆమెకు భయంకరంగా ఉంది. చేసేదిలేక సూర్యాన్ని దగ్గిరికి తీసుకుని, "తప్పక ఉత్తరాలు రాస్తూండు, మీ అమ్మని గుర్తుంచుకుని" అంది కన్నీళ్లతో. తల్లిని ఆ స్థితిలో చూసి జాలిపడ్డాడు సూర్యం. అమ్మకీ, నాన్నకీ అనేక విధాల ధైర్యం చెప్పి బయలుదేరి వెళ్లిన సూర్యం, ఈనాడిలా భార్యని వెంటబెట్టుకు వచ్చాడు.

● ● ●

"చూడు, వాళ్ళు వచ్చారు. ఎక్కడున్నావు?" అంటూ హడావిడిగా వంటింట్లోకి వచ్చిన భర్తని చూసి మీనాక్షమ్మ "ఏవ" రంటూ లేచింది.

"అదే! రామానందం, భార్యాపిల్లలూ వచ్చారు" అని చెప్పేసి బయటకు వెళ్లిపోయాడు. మీనాక్షమ్మ అతడి వెనకే బయటకు వచ్చింది.

"ప్రయాణం సుఖంగా జరిగిందా? మీ ఒంట్లో కులాసానా?" అంటూ కుశలప్రశ్నలు వేసి రేణుకను లోపలికి తీసుకువెళ్లింది.

రేణుక ఇల్లంతా కలయ చూసి,

"అబ్బాయి లేడా?" అని అడిగింది.

"లేడు. ఇద్దరూ ఇప్పుడే బయటికి వెళ్లారు. అందరూ కులాసావే కదా!"

"ఊఁ . . . మా రెండోవాడికి జ్వరం వస్తున్నది. మీరేం అలా చిక్కిపోయారు?"

నీరసంగా నవ్వింది మీనాక్షమ్మ. "నాకేం, ఏం లేదు."

అంతటితో ఆ సంభాషణ ఆగిపోయింది.

ఆ సాయంత్రం అసలు విషయం చెప్పింది రేణుక. అబ్బాయినీ, కోడలినీ కొన్నాళ్లపాటు తీసుకువెళ్లటానికి వచ్చామనీ, వాడు మళ్లీ ఉద్యోగపు ఊరు వెళ్లిపోతే చూసే అవకాశం ఉండదనీ అంటూ అడిగింది రేణుక. మీనాక్షమ్మ మౌనంగా తలఊపింది. అంతటితో ఊరుకోకుండా, "అబ్బాయి రానీండి, అడుగుదాం" అన్నది.

"దానికేంలెండి. వాడేమంటాడు?" చురుక్కుమనేట్టు చూసింది మీనాక్షమ్మ రేణుకవేపు. రేణుక ఆమెని గమనించటంలేదు. నవ్వుకుంటూ వస్తున్న కొడుకునీ, కోడలినీ చూస్తూంది.

"ఎప్పుడు వచ్చావు అమ్మా! నాన్నగారు వచ్చారా?" అని పలకరించాడు సూర్యం. సుశీల వచ్చి రేణుక దగ్గిరగా కూర్చుంది.

"ఇప్పుడే వచ్చాం. ఏమమ్మా, నీ ఒంట్లో కులాసావే కదా!" కోడల్ని అడిగింది.

"ఆఁ . . . మరిదిని తీసుకురాలేదేం?"

"వాడికి జ్వరంగా ఉంటూంది." తల్లీకొడుకూ, కోడలూ అలా కూర్చుని మాట్లాడుకుంటుంటే మీనాక్షమ్మ అక్కడ ఉండలేకపోయింది. నెమ్మదిగా లేచి లోపలికి వెళ్లిపోయింది. వాళ్లమధ్య తాను పరాయి వ్యక్తిలాగా వాళ్లతో కలిసి కబుర్లు చెప్పటానికి ఆమె మనస్సంగీకరించలేదు. దొడ్డి గడపలో వెళ్లికూర్చుంది చాలాసేపు.

జగన్నాథం భార్యకోసం వెతుక్కుంటూ దొడ్లోకి వెళ్లాడు.

దిగులుగా కూర్చున్న భార్యని చూసేసరికి ఆయన మనస్సులో ఒకవిధమైన జాలిలాంటిది కలిగింది.

"అలా ఉన్నావేం?" అని అడిగారు.

"ఏముంది?" శూన్యంలోకి చూస్తూ అన్నది.

"వాళ్లీరోజే ప్రయాణం అంటున్నారు. . ."

మీనాక్షమ్మ సూటిగా భర్త మొహంలోకి చూస్తూ అన్నది.

"మీరేం మాట్లాడలేదా?"

"ఏం మాట్లాడను?"

"నాకైతే కొన్నాళ్లు ఉంచుకోవాలని ఉంది."

"నాకూ ఉంది. అయితే వాళ్ల మాట ఎల్లా కాదవాలి?"

"అంతేనంటారా?" నిస్సహాయంగా నిట్టూర్చింది.

* * *

సాయంత్రం అయింది. ప్రయాణ సన్నాహాలు పూర్తి చేసుకుని తల్లి దగ్గిరికి వచ్చాడు సూర్యం.

"మళ్లీ ఎప్పుడు వస్తావు సూర్యం?" నిదానంగా అడిగింది.

"త్వరలోనే వస్తానమ్మా!"

"ఇప్పుడు వెళ్లక తప్పదా నాయనా?" ఆడక్కూడదనుకుంటూనే అడిగింది.

"నువ్వు వేరే విధంగా అనుకోకమ్మా . . . మళ్లీ ఉద్యోగంలో జాయినవటానికి ఎక్కువ టైములేదు..."

మీనాక్షమ్మ కొద్దిసేపాగి, "నీకేం తక్కువని ఈ ఉద్యోగాలు చెప్పు. . . . . ఇదంతా ఎవరికోసం . . ." అని సూర్యం మొహంలోకి చూస్తూ, "నువ్వెప్పుడూ మా కళ్ల ఎదట ఉండటంకన్న మాకు కావలిసింది ఏమీలేదు. . . ." అంది.

తల్లి చెప్పిందంతా విని,

"ఇంత చదువు చదివింది ఎందుకమ్మా! మగవాడు అన్నాక ఇంట్లో ఎల్లా కూచుంటాడూ?" అన్నాడు సూర్యం. ఇంక వాదించదల్చుకోలేదు మీనాక్షమ్మ. అందరూ వెళ్లిపోతూంటే నిర్వికారంగా చూస్తూ నిలబడింది.

* * *

మీనాక్షమ్మకీ, జగన్నాథానికీ ఒంటరితనం

మిగిలింది. మళ్లీ మామూలు జీవితం ప్రారంభమయింది. మీనాక్షమ్మ రోజురోజుకీ చిక్కి శల్యమవసాగింది. ఇది గమనించిన జగన్నాథం ఒకరోజు డాక్టర్ని తీసుకు వస్తానంటే వద్దని వారించింది.

"ఇది మందులతో పోయేదికాదు. మీరేం కంగారు పడకండి" అంది భర్తతో.

కొడుకూ, కోడలూ కళ్లముందు తిరుగుతూంటే చూసి సంతోషించాలనుకుందిగాని ఈవిధంగా వాళ్లు దూరం వెళ్లిపోతే తిరిగి ఒంటరి జీవితం ప్రారంభించ వలసి వస్తుందని కలలో కూడా అనుకోలేదు. ఏమి ఊహించి వాడిని ప్రేమతో దగ్గరికి తీసిందో, ఏ ఉద్దేశంతో వాడికి ఆపేక్ష, అనురాగాలు చవిచూపించిందో అవన్నీ తను కట్టుకున్న గాలిమేడల్లాగా ఉన్నాయి. 'అందరూ కలిసి తన కొడుకుని తనకు దూరం చేస్తున్నా'రనుకుంది. 'తను నవమాసాలూ మోసి కనలేదు నిజమే! అయితే కన్నతల్లికన్న తక్కువ ఏమీ చెయ్యలేదు. చిన్నప్పటినించీ వాడికష్టంలో, సుఖంలో భాగం పంచుకుని బాధలనుభవించింది తను. కానీ వాడి తల్లికాదుగదా! మరి వాడికి కూడా తనపట్ల ఇంత పరాయిభావం ఏర్పడిపోయిందెందుకు?' అస్తమానం ఆవిడ ఆలోచనలు ఈ విధంగానే సాగేవి . . . జగన్నాథం గారికి ఇది వింతగా ఉండేది. వాడేం చిన్నపాపాయికాదు, విడిచి వెళ్లిపోతే ఇంత బాధపడటానికి. పాతికేళ్లపైబడి, పెళ్లి అయి ఉద్యోగరీత్యా దూరం వెడుతూంటే ఈవిడ ఇంత బాధపడటంలో అర్థం లేదనుకున్నారు ఆయన.

"పక్షికి రెక్కలు రానంతవరకే దాన్ని సాకవలసిన బాధ్యత ఉంటుంది. రెక్కలు వచ్చి ఎగిరిపోయేస్థితికి వచ్చాక దాన్ని ఏ విధంగానూ బంధించరాదు. దాని లోకంలోకి దాన్ని స్వేచ్ఛగా వెళ్లిపోనివ్వాలి" అనేవారు భార్యతో. ఈ మాటలు ఆవిడమనసుని ఏ మాత్రమూ మార్చలేకపోయాయి. 'ఇన్నాళ్ల తన ప్రేమా వాడికి ఏమీ కాదా' అనుకుంది.

"ఇంతప్పట్నించీ ఎంత ఆపేక్షగా చూశాను! అదంతా ఏమైపోయింది! ఈనాడు వాడికి ఉద్యోగమూ, హోదాలూ కావలసివచ్చాయా?" అంది.

"అలా ఎప్పుడూ అనుకోకు. వాడు వృద్ధిలోకి వస్తే సంతోషించవలసిన నువ్వు ఇంత సంకుచితంగా ఎప్పుడూ ఆలోచించకు. నీ కళ్ల ఎదురుగా, నీకే ఉండాలనుకోవటం స్వార్థంకాదూ? అలా ఎప్పుడూ ఆలోచించకు మీనాక్షీ!" భర్తమాటలు ఆవిడకి ఏవిధంగానూ సంతృప్తి ఇవ్వలేకపోయాయి.

ఆవిడ మనోవ్యాధి రోజురోజుకీ పెరిగిపోతూంది. డాక్టర్ని తీసుకువస్తే, ఆవిడ ఒంట్లో చెప్పుకోతగ్గ జబ్బేమీ లేదంటాడు. కాలం గడుస్తున్నకొద్దీ కొన్ని చెప్పుకోతగ్గ మార్పులే జరుగుతున్నాయి. ముఖ్యంగా సూర్యం విషయంలో. . . మీనాక్షమ్మ జ్వరతీవ్రతలో ఒకనాడు ఆదేపనిగా సూర్యం పేరు తలవటంచూసి జగన్నాథంగారు ఉండబట్టలేక కొడుక్కి ఉత్తరం రాశారు ఒక్కసారి రమ్మని. వారం రోజులైనా సూర్యం రాలేదు సరిగదా జవాబుకూడాలేదు. రెండోసారి మిత్రుడు రామానందానికి వ్రాశారు అసలు సంగతేమిటని. జవాబు వచ్చింది. అందులో చెప్పుకోదగ్గ సంగతులు లేవు గానీ ఒక విషయం ఆయన్ని ఆశ్చర్యచకితుణ్ని చేసింది. . .

"వాడు ప్రస్తుతం ఏదో పరీక్షలకని బొంబాయి వెడుతున్నట్టు, సుశీల ఇక్కడే ఉన్నట్టు, అందువల్ల తను రాసిన ఉత్తరం సూర్యానికి అందకపోవచ్చునన్నట్టు" రామానందం వ్రాశాడు.

ఉత్తరం చదువుతూ చాలాసేపు అల్లాగే ఉండిపోయినాడు జగన్నాథం. అది చేతబట్టుకుని వెళ్ళి మెల్లిగా భార్యకు చదివి వినిపించారు. ఆవిడముఖం ముడుచుకుపోయింది. జగన్నాథంగారు అన్నారు చిన్నబుచ్చుకున్నట్టు:

"నాతో చెప్పటానికైనా వాడికి. . . ఇంతవరకూ నాకు తెలీదు వాడింకా పరీక్షలు రాస్తున్నట్టు."

"అయితే ఉద్యోగం మానేశాడంటారా?" కుతూహలంగా ప్రశ్నించింది మీనాక్షమ్మ. "తెలీదు."

అనేసి, ఊరుకున్నారు.

కొన్నాళ్ళకి సూర్యమూ, సుశీలా ప్రస్తుతం సెలవులో ఉన్నారనీ, వాళ్ళు నాన్నగారిదగ్గరే ఉంటున్నారనీ తెలిసి చూట్టానికి వెళ్ళాడు జగన్నాథం. వీలైతే ఒకసారి తీసుకువస్తానని చెప్పివెళ్ళాడు మీనాక్షమ్మతో.

సూర్యం తండ్రిని చూడగానే లేచి లోపలకు వెళ్ళి భార్యచేత కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళు పంపాడు. జగన్నాథం లోపలకు వచ్చేసరికి రామానందం లేడు. రేణుక కుశలప్రశ్నలు వేసింది. అన్నిటికీ జవాబులు చెప్పారు. కొద్దిసేపటికి రామానందం వచ్చాడు. అతడుకూడా అడగవలసినవి నాలుగూ అడిగి తనపనిమీద వెళ్ళిపోయాడు. ఒంటరిగా కూర్చున్న జగన్నాథానికి ఈ మనుషులవైఖరి చిత్రంగా తోచింది. స్నేహితుడి ప్రవర్తనలో మార్పు వచ్చినట్టు తోచింది. అదిసరే! సూర్యం ఎందుకలా ముక్తసరిగా ఉన్నాడు?

భోజనానికి ఉండమని బలవంతం చేసింది రేణుక ప్రయాణమవుతూంటే. భోజనాల దగ్గర అన్నాడు జగన్నాథం:

"ఒకసారి మీ ఇద్దర్నీ తీసుకురమ్మంది మీ అమ్మ. ఆవిడకూడా ఈ మధ్య చాలా జబ్బుపడి లేచింది. . ." సూర్యం ఇబ్బందిగా పెట్టాడు ముఖం. అది గమనించి రామానందం మెల్లిగా అన్నాడు. "వాడికి సెలవు అయిపోతున్నదనుకుంటాను. . ."

జగన్నాథం సూర్యంవేపు చూశాడు. 'నిజమేనా?' అన్నట్టు.

"అవును. తరవాత ఎప్పుడైనా వీలు చూసుకు వస్తాను."



తిరిగి జగన్నాథం అన్నాడు.

"నువ్వేదో పరీక్షలకి వెడుతున్నట్టు రామానందం వ్రాశాడు. ఏమిటీ, మళ్ళీ ఏదైనా చదువుతున్నావా?"

"ఆ డిప్లమాకోర్సు పాసయితే ఇంకా మంచి ఉద్యోగం దొరుకుతుంది. అయితే కొన్నాళ్ళు ఉద్యోగం మానెయ్యాలి."

"ఇప్పుడు ఈ ఉద్యోగానికేం? మరీ అతిగా చదివి ఆరోగ్యం చెడగొట్టుకోకు."

"ఈ వయస్సులో కాకపోతే ఇంకా ముందు ముందు చదవాలనుకున్నా, అవకాశమూ ఉండదు." రామానందం అన్నాడు.

జగన్నాథానికి ఏం మాట్లాడాలో తోచలేదు. ఎవిత్రమైన బాధ ఏదో ఆయన నరనరాల్ని పట్టి పిండేస్తోంది. ఆసాయంత్రమే స్వగ్రామానికి తిరిగి వచ్చేశారు. కొడుకూ, కోడలూ వస్తారని గంపెడాశతో ఎదురుచూస్తున్న మీనాక్షమ్మకి నిరాశే ఎదురైంది. భర్తమాటలు విని క్రుంగిపోయింది.

"వాడేదో పరీక్షలకి చదువుతున్నాడట! సుశీల ఇక్కడే ఉంటూంది. వాళ్ళిద్దరికీ ఇప్పట్లో ఇక్కడకి రావటానికి వీలు పడదట . . ." ఒక్క మాటలో చెప్పేసి మౌనంగా కూర్చున్నారు.

మీనాక్షమ్మ అడిగింది. "అబ్బాయి కులాసాగా ఉన్నాడా?"

"ఆహా ..."

"ఇంకా ఏమిటి సంగతులు?" మీనాక్షమ్మ అదే పనిగా అడుగుతూంటే,

"నాకే తెలీవు. నీకేం చెప్పను!" అన్నారు.

భర్తమనసు సరిగా లేదని గ్రహించి ఆ ప్రసంగం అంతటితో ఆపేసింది మీనాక్షమ్మ.

ఆ రాత్రి భోజనాలసమయంలో మీనాక్షమ్మ అడిగింది భర్తని.

"నేను వెళ్ళి అబ్బాయినీ, అమ్మాయినీ ఓ మారు చూసివస్తానండీ." జగన్నాథం ఆమె అమాయకత్వానికి లోలోపలే విచారించాడు.

"నువ్విస్థితిలో వెళ్ళలేవు. నేనే వెళ్ళి తీసుకు వస్తాను."

". . . . . . . . . ."

"ఈ పిల్లలు పెద్దవాళ్ళు ఎప్పుడవుతారా అని కలలు కంటాము గానీ. . . ఏమిటో చిన్నతనంలోనే వాళ్ళకీ మనకీ ప్రేమలు. ఆ తరవాత ఏమీలేదు."

"మీరెందుకు అట్లా మాట్లాడుతున్నారు?"

"ఏం లేదు. ఏదో గుర్తువచ్చి..." ఆ గుర్తువచ్చిన దేమిటో మీనాక్షమ్మకు తెలిసినా పైకి ఏమీ ప్రశ్నించలేదు. రోజులు గడుస్తున్నకొద్దీ మీనాక్షమ్మ మరీ చేసుకోలేక ఒక పూట ఆవిడ వండితే రెండో పూట జగన్నాథంగారు చెయ్యి కాల్చుకోవలిసి వస్తున్నది. కనీసం కోడల్ని తెచ్చి ఉంచుకోవాలని భార్యతో చెప్పి కొడుకుదగ్గిరికి బయల్దేరారు జగన్నాథంగారు.

సూర్యం ధోరణి ఆయనకు విపరీతమైన బాధ కలిగించింది. సుశీలని ఇప్పుడు పంపటానికి వీల్లేదన్నాడు సరిగదా, వాళ్ళనికూడా వచ్చి తనతో ఉండమన్నాడు. పైకి [illegible] మెల్లిగా మొదలెటాడు.

"ఒంట్లో బా[illegible] టి ప్రశ్న వేశాడు ఆయన.

"బావుండకేం?"

"సూర్యం, నిన్ను చిన్నప్పట్నించీ పెంచి పెద్ద చేశామన్న కృతజ్ఞత నీకు ఉండాలని నే నెప్పుడూ అనను నేము నీ తల్లిదండ్రులం కాకపోయినా మా పట్ల కనీసబాధ్యత నీకు కొంత ఉండాలేమో అనుకుంటున్నాను. . ."

". . . . . . . . . ."

'మీ అమ్మ నిన్నెట్లా పెంచిందో నీకు తెలీదు. నాకు తెలుసు. ఈ మధ్య మీ నాన్నగారుకూడా ఆదో విధంగా ఉంటున్నారు. నీ మనస్సులో ఉన్నదేమిటో నాకు తెలియచెయ్యరాదూ!"

"నాన్నగారు వ్రాశారు ఇద్దర్నీ పండక్కి అక్కడకు రమ్మని. వాళ్ళకీ ఈ మధ్య ఒంట్లో ఏమీ బావుండటం లేదు. మీకు తెలిసేఉంటుంది. అక్కణ్నుంచి అటు వస్తాను."

ఆ సంభాషణ అంతటితో ఆపేశాడు సూర్యం. కానీ దాని తాత్పర్యమేమిటో తరవాతగానీ తెలిసిరాలేదు జగన్నాథానికి కొడుకుప్రవర్తనద్వారా. అందువల్ల



విశ్రాంతి

ఫోటో—మోదిని అప్పారావు (రాజమండ్రి-2)

ఆయన బాధ పడ్డాడే గానీ ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగా గానీ దూషించలేదు . మనస్సు నిబ్బరంగా ఉంచుకుని తిరుగు ప్రయాణం సాగించారు ఒంటరిగా.

తను చేసిన పనిలో పొరపాటెక్కడఉందో ఆయనకు ఎంత ఆలోచించినా తెలిసిరావటం లేదు. కొడుకులోని ఈ మార్పుకి మీనాక్షి ఏ విధంగా తట్టుకుంటుంది? సూర్యం ప్రవర్తనకుగల అర్థమేమిటో స్పష్టంగా బోధపడింది. వాడికి తనకన్న తల్లితండ్రులెవరో, పెంచినవారెవరో, ఎవరిపట్ల తను బాధ్యతాయుతంగా ప్రవర్తించాలో ఈనాడు బాగా తెలుసుకున్నట్టున్నాడు. ఎవరి హృదయాల్లో ప్రేమాభిమానాలు నిండిఉన్నాయో వాడింకా తెలుసుకోలేదు. డబ్బు కోసం తనెప్పుడూ [illegible]డుగానీ మనిషి మానసికమైన విలువలు ఇంతగా దిగజారుతున్నందుకు విచారించాడు.

ఇంటికి తిరిగివచ్చిన జగన్నాథానికి విపరీత పరిణామాలు ఎదురయ్యాయి. మీనాక్షమ్మగారి స్థితి ఏమీ బావుండలేదు. మంచానికి ఎల్లిపోయి [illegible] కళ్ళు లోతుకుపోయి ఇంకాదేనికో ఎదురుచూస్తున్నట్టున్న ఆమె చూపులకు కరిగిపోయారు జగన్నాథంగారు. ఆమెను ఏ విధంగానూ చిన్నబుచ్చటం ఇష్టంలేక సూర్యానికి వెంటనే టెలిగ్రాం ఇచ్చారు.

వాడిపోయిన జగన్నాథంగారి మొహంలోకి చూస్తూ ఏదో సంగతి తెలుసుకున్నట్టు "అబ్బాయి రాలేదు కదూ, మరేం బాధ పడకండి" అంది.

". . . . . . . . . . ."

భర్త చొక్కా చేత్తో రాస్తూ, "నేను వాడి విషయంలో ఏ లోటూ చెయ్యలేదనే అనుకుంటున్నాను. వాణ్ణీవిధంగా దూరం చేసుకుంటావని కల్లోకూడా అనుకోలేదు, నా కళ్ళముందు పిల్లాపాపతో కలకల్లాడుతూ ఉండాలనుకున్నాను గానీ. . ." మీనాక్షమ్మకళ్ళలో నీళ్ళు నిల్చాయి.

జగన్నాథంగారు మాట్లాడకుండా కూర్చున్నారు భార్యతలని ఒడిలో పెట్టుకుని. భార్య ఈ విధంగా బాధ పడటానికి తనుకూడా కారకుడేమో అన్న భావన ఆయన మనసులో నిల్చి తట్టుకోలేకుండా ఉన్నాడు.

"పరాయి బిడ్డ అయినా ఒక కడుపులో పెట్టుకున్నాను. నా కెందుకో వాడు నా కన్నకొడుకేనేమో అనే భ్రాంతి కలిగేది ఎప్పుడూ. వాణ్ణి అంతగా ప్రేమించాను. ఇప్పుడు వాడికవన్నీ ఎందుకూ కాకుండా పోయాయి. నేను చేసిన తప్పేమిటి? నేనేం పాపం చేసుకున్నాను."

"నువ్వుకాదు పాపం చేసుకుంది. నేను. అంతా నేను చేశాను." ఎన్నడూ లేనిది కంటతడిపెడుతున్న భర్తని చూసి మీనాక్షి లేవబోతూ, "వద్దు. మీరెందుకు? ఇదంతా నా దురదృష్టం" అంది.

"కాదు. అంతా నేనే చేశాను. నిశ్చింతగా బతుకుతున్న నీ జీవితంలో ఈ బాధా, ప్రేమా ప్రవేశింపచేసింది నేనే. ఈనాడు నువ్విస్థితిలో ఉండటానికి కారకుణ్ణీ నేనే. . . నన్ను క్షమించు మీనాక్షీ." మీనాక్షమ్మ సమాధానమివ్వకుండా భర్తవేపు చూస్తోంది.

"అబ్బాయి రాడు. నాకు తెలుసు. నేను పోయాక నైనా వాడు మిమ్మల్ని తండ్రిగా గుర్తించేట్టు చేసుకోండి. . ." మీనాక్షమ్మ స్థితి ఆఖరుదశకు వచ్చేసింది. ఆ క్షణంవరకూ ఎదురుచూస్తూనే ఉంది చిన్న ఆశాకిరణం . . . 'చిన్నవాడు తనను అత్యంత ప్రేమతో, అతి శ్రద్ధతో పెంచిన తల్లికోసం. . . రాడా? పన్నెండేళ్ళ సూర్యం తల్లి దగ్గిర గారం చేస్తూ, తండ్రిదగ్గిర చివాట్లు తింటూ, అంతకంతకూ పెరిగిపోయిన కొడుకుని తృప్తిగా గర్వంగా చూసుకునే తను ఈనాడు ఆఖరి క్షణాల్లో వాడికోసం. . . వాడు వస్తేచాలు, ఒక్కసారి కన్నెత్తి చూస్తేచాలు, "అమ్మా" అని నోరారా పిలిస్తే చాలు!. . . తను నిశ్చింతగా ప్రాణాలు విడుస్తుంది. కానీ ఆ భాగ్యమే తనకు లేదు. ఏ తల్లికీ ఇటువంటి నరకం వద్దు భగవంతుడా! తను వాణ్ణి కనలేదు, నిజమే! కానీ, కన్నతల్లి పడేంత వేదనా తనకు కలిగిస్తున్నాడు. ఇదంతా తన దురదృష్టమే!' అస్పష్టంగా ఏవో మాటలు అంటున్న భార్యవేపు చూశారు జగన్నాథం గారు. ఆవిడ అట్లా పెదవులు కదిలిస్తూనే ప్రాణాలు విడిచింది.

జగన్నాథంగారు ఆమెమీద పడి ఏడవలేదు, తల బాదుకోలేదు. తనకు అర్థంగాని ప్రపంచసత్యం ఏదో గోచరిస్తుంటే శూన్యంలోకి చూస్తూ కూచున్నారు. ★